క్లుప్తంగా

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేంపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

వెంకటాద్రిపై 16 నుంచి ధనుర్మాసోత్సవాలు



పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి ధనుర్మాస, గోదా రంగనాయకుల కల్యాణ మహోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజార్యులు ప్రకటనలో తెలిపారు. జనవరి 13న గోదా రంగనాయకుల కల్యాణోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా జనవరి 1న స్వామివారికి నవనీత సేవ, జనవరి 5న సుదర్శన హోమం, సామూహిక కుంకుమ పూజలు, భారీ అన్నసమారాధన, 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని గిరి ప్రదక్షిణ, ఉత్తర ద్వార దర్శనం జరుగుతాయన్నారు. జనవరి 11న కుడారై ఉత్సవం, 12న తిరువీధి ఉత్సవం, 13న గోద రంగనాయకుల కల్యాణ మహోత్సవం చేపడతామన్నారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 22 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శివకుమార్, సిబ్బంది

పెందుర్తి: మండలంలోని పినగాడి వెల్ఫేర్ ఇంజినీరింగ్ (విస్తం) కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఎడబ్ల్యూటీ ఈసీకెఈఎస్ కంపెనీలో ఉద్యోగాలకు 22 మంది ఎంపికయ్యారు. సీఎస్ఈ బ్రాంచ్ నుంచి 15 మంది, ఈసీఈ బ్రాంచ్ నుంచి ఏడుగురు అర్హత పొందారు. కంపెనీ అధినేత మనోజ్‌కుమార్ కొరవంగి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి శివప్రసాద్, ప్లేస్‌మెంట్ అధికారులు ఈ.కిరణ్ కుమార్, ఎం.వి.జె.టి అరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ కనకారావు, దాతలు

పరవాడ: కలపాక శివారు మరిశవానిపాలెం గ్రామానికి చెందిన ఎర్రా శ్రీను (30) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో దాతలు సహకారంలో సమకూర్చిన ఆర్థిక సాయం రూ.55 వేలను సర్పంచ్ బొండా కనకరావు, ఎంపీటీసీ సప్పా ప్రభ సన్యాసిరావుల చేతుల మీదుగా మృతుడి తల్లి ఎర్రా కొండమ్మకు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇందల రామారావు, జి.జానీకరామ్, బొండా సరోజిని, ఉప సర్పంచ్ అక్కిరెడ్డి శ్రీనివాస్,ఎస్.శ్రీనాథ్, ఎస్.రమణోజి, ఎ.రమణ, బి.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సవాల్..!

- పెందుర్తిలో పెరుగుతున్న చోరీలు
- బిక్కుబిక్కుమంటున్న ప్రజలు
- రాత్రి గస్తీలు అంతంతమాత్రమే



పినగాడిలో మంగళవారం అర్ధరాత్రి దొంగతనం జరిగిన ఇల్లు



గత నెల 18న పెందుర్తిలో దోపిడీకి గురైన ఏటీఎం



సెప్టెంబర్ 10న పట్టపగలు దువ్వపాలెంలో మహిళ మెడలో పుస్తెలతాడు తెంచుకుపోతున్న దుండగుడు

సంవత్సరం	హౌస్ బ్రేకింగ్ దొంగతనాలు	చైన్‌స్నాచింగ్
2021	10	5
2022	15	4
2023	10	6
2024	34	6

పెందుర్తిలో వరుస చోరీలతో దొంగలు రెచ్చిపోతున్నారు. ఇళ్లు, ఏటీఎంలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. పోలీసులు కూడా ఏదైనా సంఘటన జరిగినప్పుడు హడావుడి తప్ప చర్యలేం తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రీపగలూ తేడా లేకుండా దొంగలు రెచ్చిపోతున్నారంటే పెందుర్తి పరిసర ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. – పెందుర్తి

'ఆగస్టు 18..ఆదివారం వేకువజాము..దాదాపు 3.30 గంటల సమయం..పెందుర్తి నటరాజ్ థియేటర్‌కు ఆనుకుని ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంను నిమిషాల వ్యవధిలో దుండగులు కొల్లగొట్టారు. రూ.19.50 లక్షలు దోచుకుపోయారు. నేరం జరిగిన దాదాపు 9 గంటల వరకు పోలీసులు ఇక్కడకు రాలేదు. తర్వాత ఉన్నతాధికారులు రావడం..మిగిలిన తతంగం అంతా మామూలే'

'ఆగస్టు 19 సోమవారం వేకువజాము.. పెందుర్తి రైల్వే స్టేషన్ దారిలోని ఓ కాలనీలో వరుసగా మూడు ఇళ్లల్లో దొంగలు పడ్డారు. 17 తులాల బంగారు ఆభరణాలు, కిలోన్నర వెండి ఎత్తుకుపోయారు..నేరం జరిగిన తర్వాత సమాచారం అందుకున్న పోలీసులు యథావిధిగా కేసులు నమోదు..విచారణ సాగిస్తున్నారు.

'సెప్టెంబర్ 25.. పెందుర్తి కూడలికి సమీపంలోని ఎలక్ట్రికల్, మోటార్ల దుకాణాలను దుండగులు షట్టర్లు తెరిచి దాదాపు రూ.2 లక్షల విలువైన సామాగ్రిని ఎత్తుకుపోయారు'

'సెప్టెంబర్ 15 పల్లినారాయణపురంలో ఓ ఇంటిని కొల్లగొట్టి బంగారం, నగదు ఎత్తుకుపోయారు.'

'నవంబర్ 4.. చినముషిడివాడ, పాపయ్యరాజు పాలెం ప్రాంతాల్లో రెండు ఆలయాలను కొల్లగొట్టి హుండీలు ఎత్తుకుపోయారు'

'తాజాగా మంగళవారం అర్ధరాత్రి పెందుర్తి మండలం పినగాడిలో ఓ ఇంట్లోకి చొరబడిన ముగ్గురు దుండగులు కత్తులతో ఇంటి యజమానిని బెదిరించి రూ.5.20 లక్షల నగదు..8 తులాల బంగారు ఆభరణాలు దోచుకుపోయారు'

ఇలా దొంగతనాలు జరిగిన వెంటనే ఒకటి రెండు రోజులు పోలీసుల హడావుడి కనిపిస్తోంది. చోరీలు అరికట్టేందుకు ఏమాత్రం చర్యలు తీసుకున్నట్టు కనిపించడం లేదు. సీసీ కెమెరాల ఏర్పాటు, ఇతర జాగ్రత్తలపై క్రైం విభాగం పెద్దలు పెద్దగా దృష్టి సారించడం లేదు. నగర శివారు ప్రాంతంలో దొంగలు చెలరేగిపోతున్నా.. వరుస దొంగతనాలతో ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నా ఖాకీల్లో పెద్దగా చలనం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పెందుర్తి క్రైం విభాగానికి వెస్ట్ జోన్ సర్కిల్ అజమాయిషీ కావడంతో (గతంలో పెందుర్తి క్రైం విభాగానికి ప్రత్యేకంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉండేవారు) ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి పూర్తి స్థాయిలో దృష్టి సారించడం సాధ్యం కావడం లేదు. మరోవైపు సబ్ ఇన్‌స్పెక్టర్ ఎవరికీ అందుబాటులో ఉండని పరిస్థితి. దీంతో నిత్యం ఏదో చోట దొంగలు తమ ఉనికిని చాటుకుంటున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఇళ్లను లూటీ చేయడం..చైన్ స్నాచింగ్‌లకు పాల్పడడం చేస్తున్నారు. గత మూడు నాలుగు నెలల వ్యవధిలో నేరాల సంఖ్య ఒక్కసారిగా పెరిగిపోయింది.

ప్రజల్లో గుబులు..

పెందుర్తి ప్రాంతంలో మూడు నాలుగేళ్లలో నేరాల సంఖ్య ఘననీయంగా తగ్గుముఖం పట్టింది. అయితే ఇటీవల కాలంలో ఒక్కసారిగా మళ్లీ దొంగలు చెలరేగిపోతున్నారు. ఎంతో రద్దీగా ఉండే పెందుర్తి కూడలికి సమీపంలోని ఏటీఎంను కొల్లగొట్టడంతో ప్రజలతో పాటు పోలీసులు సైతం అవాక్కయ్యారు. అది జరిగి 24 గంటల గడవక ముందే పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు దాదాపు కిలో మీటరు దూరంలో ఉన్న జనచైతన్య లేఅవుట్ గణేష్‌నగర్‌లో ఏకకాలంలో మూడిళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. పట్టపగలే దువ్వపాలెం గ్రామంలో మహిళ మెడలో పుస్తెలతాడు తెంచుకుపోయిన తీరుతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తాజాగా పినగాడిలో రోడ్డు పక్కన ఉన్న ఇంట్లోకి కత్తులతో దుండగులు చొరబడి దోపిడీకి పాల్పడడంతో ప్రజలు మరోసారి ఉలిక్కిపడ్డారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి పెందుర్తి సర్కిల్ పరిధిలో పూర్తిస్థాయిలో అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

పూర్తిస్థాయిలో గస్తీ



పెందుర్తి ప్రాంతంలో జరుగుతున్న నేరాల నియంత్రణకు పూర్తిస్థాయిలో గస్తీ ఏర్పాటు చేస్తున్నాం. దొంగతనాలు రాత్రి-పగలు కూడా జరుగుతున్నందున విలువైన వస్తువులు లాకర్‌లో భద్రపరుచుకోవాలి. అపార్ట్‌మెంట్లు, ఇళ్లకు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఒంటరిగా నడిచి వెళ్లే మహిళలు నగలు జాగ్రత్తగా చూసుకోవాలి. ప్రజలు ఇల్లు వదిలి ఊరు వెళ్లేటప్పుడు ఇంటి చిరునామా సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలి. అపరిచిత వ్యక్తుల సమాచారం కోసం 1090, 100, క్రైం సీఐ: 94409 04717, క్రైం ఎస్ఐ 83310 41618, పీఎస్ 0891-2764233 నంబర్లలలో సంప్రదించాలి.

–డి.సూరిబాబు, పెందుర్తి క్రైం విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్

పినగాడిలో దొంగల వీరంగం



దొంగలు విరగ్గొట్టిన బీరువా



చిందరవందరగా దుస్తులు

- అర్ధరాత్రి మహిళ ఇంట్లోకి చొరబడిన ముగ్గురు దుండగులు
- కత్తితో బెదిరించి రూ.5.20 లక్షలు, 8 తులాల బంగారం అపహరణ



పినగాడిలో చోరీ జరిగిన ఇంటి వద్ద విషాద వదనంతో బాధిత కుటుంబ సభ్యులు

పెందుర్తి: నగర శివారు పెందుర్తిలో చోరీలు ఆగడం లేదు. ఇప్పటివరకు పట్టణ ప్రాంతంలో జరిగిన ఇంటి దోపిడీలు తాజాగా గ్రామీణ ప్రాంతానికి పాకాయి. పెందుర్తి మండలం పినగాడి ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఇంట్లోకి అర్ధరాత్రి చొరబడిన ముగ్గురు దుండగులు మహిళను కత్తులతో బెదిరించి దొంగతనానికి పాల్పడ్డారు. రూ.5.20 లక్షల నగదు, 8 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకుపోయారు. ఈ ఘటనతో పెందుర్తి గ్రామీణ ప్రాంత ప్రజలు మరోసారి ఉలిక్కిపడ్డారు. వివరాలిలా.. పినగాడిలో నివసిస్తున్న షేక్ షకీనాకు ఇద్దరు కుమారులు రెహ్మాన్, రంజాన్. అన్నదమ్ములిద్దరూ ఉమ్మడిగా మటన్ దుకాణాలు నిర్వహిస్తుంటారు. వీరి మేనకోడలి వివాహం త్వరలో జరగనుండటంతో పాటు మటన్ దుకాణాల నిర్వాహణ నిమిత్తం బ్యాంక్‌లో ఉన్న తమ నగదును ఇంటికి తీసుకొచ్చారు. ఆ మొత్తాన్ని తల్లి ఉంటున్న పాత ఇంట్లో ఉంచారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ముగ్గురు దుండగులు బైక్‌ల మీద వచ్చి షకీనా ఉంటున్న ఇంటి తలుపులు కొట్టారు. తెలిసిన వారు ఎవరో అనుకుని ఆమె తలుపు తీయడంతో కత్తి బెదిరించి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాను విరగ్గొట్టి రూ.5.20 లక్షల నగదు, 8 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకుపోయినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుధవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకున్న పెందుర్తి క్రైం పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. కేసు దర్యాప్తు జరుగుతోంది. ఎవరో పక్కా ప్రణాళికతోనే చోరీ చేసినట్లు కనిపిస్తోందని పోలీసులు భావిస్తున్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై దృష్టి



శిక్షణను ప్రారంభిస్తున్న జెట్టి సుబ్బారావు



కార్యక్రమంలో పాల్గొన్న భద్రత ఉద్యోగులు

పరవాడ: భద్రత ప్రమాణాలపై దృష్టి సారించడం ద్వారా పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించడం సాధ్యపడుతోందని ఎంఏఎస్ఆర్ఎం సొసైటీ కార్యదర్శి జెట్టి సుబ్బారావు అన్నారు. ఇస్రాయి విశాఖ చాప్టర్ ఆధ్వర్యంలో ఎంఏఎస్ఆర్ఎం సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన ఫార్మా కనెక్ట్ కెమికల్ సేఫ్టీ శిక్షణ కార్యక్రమాన్ని సుబ్బారావు, ప్రతినిధులు ఎస్.మహేశ్వరరావు, పి.వెంకటకృష్ణ, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు బి.మధు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ అధునాతన కెమికల్ సేఫ్టీ, ఏఐ ఇన్ ఫార్మా ఇన్‌సైట్స్ ఇన్వలేషన్ అండ్ ఇంపాక్ట్ , ప్లాంట్ రిటైబిలిటీ విత్ డయాగ్నైజేషన్ , బేసిక్ ఆఫ్ ఎయిర్ ఫిల్ట్రేషన్ అండ్ హెచ్ ఈపీఏ ఫిల్టర్స్ టాపిక్‌పై ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఫార్మా పరిశ్రమల నుంచి 86 మంది భద్రత ఉద్యోగులు హాజరయ్యారు.

ప్రొఫెసర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ ప్రతినిధులు

పెందుర్తి: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం దళిత సామాజికవర్గానికి చెందిన ప్రొఫెసర్ చంగయ్యపై దుండగులు దాడి చేయడాన్ని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోను కృష్ణ ఖండించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘటనపై బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బోను కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై దాడులు జరగడం మంచి పరిణామం కాదన్నారు. ఈ ఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని చట్టాలను పక్కాగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ ప్రతినిధులు కరణం తిరుపతిరావు, కనకమహాలక్ష్మి, జంగాల గోపాలరావు, విశ్వనాథం, అప్పలరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో లిఖిత అద్భుత ప్రతిభ

- 11వ కామన్‌వెల్త్ చాంపియన్‌షిప్‌లో రెండు క్యాంస పతకాలు



పెందుర్తి: దక్షిణాఫ్రికా డర్బన్‌లో ఇటీవల జరిగిన 11వ కామన్‌వెల్త్ కరాటే చాంపియన్‌షిప్‌లో వేపగుంటకు చెందిన టి.లిఖిత చక్కటి ప్రతిభ కనబరిచింది. 68 కిలోల వ్యక్తిగత కుమిటీ, టీమ్ కుమిటీ విభాగాల్లో క్యాంస పతకాలు సాధించి సత్తా చాటింది. వేపగుంటలోని చాంపియన్స్ అకాడమిలో శిక్షణ పొందుతున్న ఆమె అంతర్రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించింది. కామన్‌వెల్త్ పోటీల్లో పతకాలు సాధించిన లిఖితను కరాటే చాంపియన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి, జాతీయ జట్టు కోచ్ కీర్తన్ కొండ్రు అభినందించారు.

విగ్రహాల ఊరేగింపు



సబ్బవరంలో విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

సబ్బవరం: మండలంలోని గొర్లివానిపాలెం గ్రామంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అయ్యప్ప, సరస్వతి, నాగబంద, పసిడి కలశ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వరపూజ, పుణ్యావచనం, రుత్వికవరుణ, రక్ష సూత్రధారణ, దీక్షాధారణ,అగ్నిమథనం తదితర క్రతువులను నిర్వహించారు. అనంతరం గొర్లివానిపాలెం, కొత్తరోడ్డు, పాతరోడ్డు, గోపాలనగర్, సబ్బవరం మీదుగా తిరిగి గొర్లివానిపాలెం వరకూ విగ్రహాల ఊరేగింపు కొనసాగింది. గురువారం ఉదయం 8:41 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త గొర్లి అచ్చెంనాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తతో పాటు మాజీ ఎంపీపీ గొర్లి ఉమా మహేశ్వరరావు, ఎంపీటీసీ గొర్లి చైతన్య, గ్రామ పెద్దలు గండి దేముడు, బాదిరెడ్డి లక్ష్మణ, శివ, నీలేశ్వరరావు, నెక్కల త్రిమూర్తులు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

124 బస్తాల పీడీఎస్ బియ్యం సీజ్

తగరపువలస : ఆనందపురం మండలం పెద్దిపాలెంలో గల శ్రీవాసవి ఎంటర్ ప్రైజస్ రైస్ మిల్లులో తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. లెక్కల్లో లేని 124 బ్యాగుల బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ మిల్లుపై 6ఎ కేసు నమోదు చేశారు. గత ఆరు నెలల కాలంలో పౌరసరఫరాల శాఖ నగర పరిధిలో 6ఎ కేసులు 123 నమోదు చేశారు. రూ.17.90 లక్షల విలువ చేసే 114.573 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేశారు. అక్రమ బియ్యం రవాణాకు వినియోగించిన 13 వాహనాలను సీజ్ చేసి ఆరుగురు వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

ఆక్వా టెక్నీషియన్లకు శిక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న మత్స్య శాఖ జేడీ లక్ష్మణరావు, రవికుమార్, హనుమంతరావు, ప్రసాద్

మహారాణిపేట: సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల సంస్థ(ఎంపెడా) విశాఖపట్నం ఆధ్వర్యంలో రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాల్లో పనిచేసే టెక్నీషియన్లకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం వర్చువల్‌గా ఎంపెడా డైరెక్టర్ డాక్టర్ కార్తికేయన్ ప్రారంభించారు. ఫిషింగ్ హార్బర్ సమీపంలోని సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎంఎఫ్ఆర్ఐ) కార్యాలయంలో నాలుగు రోజుల పాటు శిక్షణ జరుగుతుందన్నారు. దేశంలోని ఆక్వా ఉత్పత్తుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉందని డైరెక్టర్ తెలిపారు. సుస్థిర ఆక్వా సాగు, నాణ్యమైన రొయ్యల పిల్లల ఉత్పత్తి, నాణ్యమైన ఆక్వా ఉత్పత్తులపై ఆక్వా టెక్నీషియన్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. నిషేధిత ఆంటి బయోటిక్స్, ఆంటి మైక్రో బియల్ రెసిస్టెన్స్‌పై అవగాహన కల్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో హేచరీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.రవికుమార్, రాజ్‌కమల్ హేచరీస్ అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వరరావు, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు, ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్లు హనుమంతరావు, ఆర్.ప్రసాద్, వివిధ విభాగాల అధికారులు డాక్టర్ శంకరరావు, డాక్టర్ కందన్, డాక్టర్ విజయకుమార్, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ జోయ్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 30 మంది హేచరీస్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

భరోసా గంగపాలు

కూటమి పార్టీల నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నమ్మి ఓట్లు వేస్తే అధికారంలోకి వచ్చాక ఇలా మొండిచెయ్యి చూపుతారని అనుకోలేదని గంగపుత్రులు మండిపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాటు వేట నిషేధ సమయంలోనే ఏటా రూ.10 వేల చొప్పున మత్స్యకార భరోసా అందజేశారని గుర్తు చేసుకుంటున్నారు. రూ.20 వేల చొప్పున మత్స్యకార భరోసా ఇస్తామని నమ్మబలికి గద్దెనెక్కిన చంద్రబాబు ప్రభుత్వం ఆరు నెలల్లో తమకు ఎలాంటి సాయం అందించలేదని వాపోతున్నారు.



ఉప్పుటేరు వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పడవలు

- ఆరు నెలలైనా అందని మత్స్యకార భరోసా
- వరుస తుపాన్లతో వేటసాగక ఇంటిపట్టునే గంగపుత్రులు
- బతికేది ఎలా అంటూ ఆవేదన
- పట్టించుకోని కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం

పరవాడ:

చేపల వేటే ఆధారంగా జీవనం సాగించే గంగపుత్రులు జీవన ప్రయాణంలో అష్టకష్టాలు పడుతున్నారు. సముద్రంలో సంభవించే ప్రకృతి వైపరీత్యాలతో పాటు ఫార్మా, ఎన్టీపీసీ పరిశ్రమలు విడుదల చేస్తున్న వ్యర్థ రసాయనాల కారణంగా మత్స్య సంపద నాశనమవుతోంది. ఫలితంగా మత్స్యకారులకు గతంలో మాదిరి వలలకు చేపలు చిక్కకపోవడంతో వట్టి చేతులతో తిరుగు ముఖం పడుతున్నారు. ఈ ఏడాది తుపాన్లు సంఖ్య పెరిగింది. తుపాను సమయంలో వేట సాగక వారం, పది రోజులు ఇళ్ల వద్దే కాలక్షేపం చేస్తున్నామని ముత్యాలమ్మపాలెం మత్స్యకార్మికులు చెబుతున్నారు. ఏటా ప్రభుత్వం చేపల వేట నిషేధ సమయంలో గంగపుత్రులకు కల్పించే మత్స్యకార భరోసా కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావస్తున్న నేటి వరకు అందలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సముద్రంలో మత్స్య సంపద ఉత్పత్తి కోసం చేపలు గుడ్లు పెట్టే సమయం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14. సుమారు 60 రోజులు పాటు సముద్రంలో చేపల వేట నిషేధ సమయంగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ కాలంలో మత్స్యకారులకు ఆర్థిక భరోసాగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.10 వేలు అందజేసేది. దానిని కూటమి నేతలు రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అయితే నేటి వరకు ఆర్థిక భరోసా అందకపోవడంతో గంగపుత్రులు సతమతమవుతున్నారు.

972 మంది చేపల వేట

ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, దిబ్బపాలెం గ్రామాల్లో 162 బోట్లలో 972 మంది మత్స్యకారులు చేపల వేట సాగిస్తున్నారు. వీరంత మత్స్యకార భరోసాకు అర్హులేనని మత్స్యకార్మిక శాఖ జాబితను సిద్ధం చేసింది. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావస్తున్న మత్స్యకార భరోసా ఊసే లేదు. ప్రభుత్వం తీరు చూస్తుంటే ఈ ఏడాదికి మత్స్యకార భరోసా గంగలో కలిపేసినట్టేనని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఇంతవరకు వేట నిషేధ భత్యం అందక, చేపల వేట సక్రమంగా సాగక కుటుంబ పోషణ కష్టంగా ఉందని, మరో పక్క పరిశ్రమల విష కాలుష్యంతో మత్స్య సంపద నాశనమవుతుండడంతో ఏటా తీవ్ర నష్టాలను చవిచూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క చేపల వేట లేక పెరిగిన నిత్యావసర ధరలు, కూరగాయాల ధరలతో బతుకు భారంగా నెట్టుకొస్తున్నామని గంగపుత్రులు చెబుతున్నారు.

మత్స్యకార భరోసా ఎప్పుడిస్తారో..



గత ప్రభుత్వంలో ఐదేళ్ల కాలంలో ఏ ఇబ్బంది లేకుండా మత్స్యకార భరోసా రూ.10 వేలు అందేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతే ఆర్థిక భరోసా పమయానికి అందలేదు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు మత్స్యకార భరోసాను రూ.20 వేలు ఇస్తామని చెప్పారు. ఇంతవరకు ఆ ఊసే లేదు. నిషేధ కాలం ముగిసి ఐదు నెలలు కావస్తున్న భరోసా సాయం అందలేదు. ఇస్తారో ఇవ్వరో తెలియడం లేదు. చాలా ఇబ్బందిగా ఉంది.

–నూరాడ మసేను, మత్స్యకార్మికుడు, ముత్యాలమ్మపాలెం

చేపల వేట సాగలేదు



వేట నిషేధ సమయం ముగిసి చాలా కాలం అయింది. గత ప్రభుత్వం వేట నిషేధం గడువు ముగియగానే వెంటనే భరోసాను అందించేది. కూటమి అధికారం చేపట్టిన తరువాత మత్స్యకార భరోసా పంపిణీలో ఆలస్యం చేస్తోంది. ప్రస్తుతం చేపల వేట సాగక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. మా కష్టాలను గుర్తించి మత్స్యకార భరోసాను అందించండి.

–మైలపల్లి బంగారి, మత్స్యకారుడు

పూటగడవడం కష్టంగా ఉంది



ఈ ఏడాదిలో తరచూ తుపాన్లతో సముద్రంపై చేపల వేట సాగకక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాం. తుపాను వస్తే వారం పది రోజులు ఇళ్లకే పరిమితమవుతున్నాం. వేట నిషేధ సమయంలో గత ప్రభుత్వం రూ.10 వేలు భరోసా ఇచ్చేది..దాంతో తిండి ఖర్చులకు సరిపోయేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక మత్స్యకార భరోసాను ఇంత వరకు అందించలేదు.

–చింతకాయల కొండబాబు, మత్స్యకారుడు